
సాక్షి ఒడిశా

గురువారం । 9 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.4,51,470
బంగారం 10 గ్రాముల 300 మిల్లీ గ్రాములు
వెండి 2 గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



23, 24 తేదీల్లో జాబ్‌మేళా

ఈనెల 23, 24 తేదీల్లో గజపతి జిల్లాస్థాయి జాబ్ మేళా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

-IIలో ▸



నిరుపేదలకు రగ్గుల పంపిణీ

సమితిలోని కుందారిగుడ గ్రామంలో నిరుపేదలకు మహిళా రచయితల సంఘం సంసద్ సభ్యులు రగ్గులను బుధవారం అందజేశారు.

-IIలో ▸

న్యూస్‌రీల్

ఎటువంటి లైసెన్స్‌లు ఇవ్వడం లేదు

• గంజాం జిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా



సమావేశంలో ప్రకటిస్తున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

బరంపురం: గంజాం జిల్లాలో ఈ ఏడాది బాణాసంచా తయారీ యూనిట్లుకు ఎటువంటి లైసెన్స్‌లు ఇవ్వడం లేదని కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా స్పష్టం చేశారు. రెండు నెలల క్రితం బంజనగర్, నొలగుంటా గ్రామాల్లో అక్రమంగా బాణాసంచా తయారు చేస్తుండగా భారీ విస్ఫోటనం జరిగిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది గంజాం జిల్లాలో తయారీ యూనిట్లు రద్దు చేసినట్లు స్పష్టం చేశారు.

గంజాంలో అగ్ని ప్రమాదం

• 25 మేకలు మృత్యువాత



మృత్యువాతపడిన మేకలు

బరంపురం: గంజాం జిల్లా పులసరా బ్లాక్ పరిధి మరదా పంచాయతీ గుడిమలి గ్రామంలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పశువుల శాలలోని 25 మేకలు మృత్యువాతపడ్డాయి. సమాచారం అందుకున్న బంజనగర్ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. బాధితురాలు పద్మా పాత్రో పులసరా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిరుపేదనైన తనకు ప్రభుత్వం సాయం అందించాలని కోరారు.

లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

రాయగడ: గుమ్మ నుంచి రాయగడ మీదుగా జేకేపూర్ కర్రల లోడుతో వెళ్తున్న ఒక లారీ అదుపు తప్పి జఫాకాల్ వద్ద బోల్తా పడింది. దీంతో లారీలోని కర్రలు రోడ్డుమీద పడడంతో రెండు గంటల పాటుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, బోల్తాపడిన లారీని జేసీబీతో పక్కకు నెట్టించడంతో యథావిధిగా రాకపోకలు కొనసాగాయి.

బర్రెను ఢీకొన్న ద్విచక్ర వాహనం



సంఘటన స్థలం వద్ద మృతి చెందిన బర్రె

రాయగడ: బర్రెను ద్విచక్ర వాహనంతో ఢీకొన్న ఘటనలో బర్రె మృతి చెందగా, వాహన చోదకుడికి తీవ్రగాయాలైన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి రెంగా గ్రామం వద్ద బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. కాసీపూర్‌కు చెందిన ఉమేష్ నాయక్ (32) అనే వ్యక్తి తన బైకుపై కాసీపూర్ నుంచి రెంగా వెళ్తున్న సమయంలో రోడ్డకు అడ్డంగా వచ్చిన బర్రెను ఢీకొన్నాడు. ఈ ఘటనలో బర్రె సంఘన స్థలం వద్ద మృతి చెందగా, గాయపడిన ఉమేష్‌ను అక్కడి ప్రజలు టికిరిలోని ఉపాపాడు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

ఇళ్లపట్టాలు పంపిణీ



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొమాంగో

రాయగడ: జిల్లాలోని రామనుగడ సమితి కుజేంద్రి పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 43 మంది పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో ముఖ్య అతిథిగా హాజరై పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో రామనగుడ తహసీల్దార్ నిర్మల్ చంద్ర సాహు, అదనపు తహసీల్దార్ గొయాధర్ బెహర, కుజేంద్రి సర్పంచ్ రమేష్ సాబొరొ, బీజేడీ జిల్లా కార్యదర్శి గగన్ బిహారి ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

హరిత కాంతుల వేడుక...

ప్రతి ఇల్లూ వేదిక



• బాణాసంచా పేల్చడంపై ఆంక్షలు
• హరిత బాణాసంచా మాత్రమే కాల్చాలని ఆదేశాలు
• ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



రైళ్లలో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



ఖుర్దారోడ్ రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ప్రమాదకర కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని బాణాసంచా నిషేధించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్రంలో దీపావళి రోజున పటాకులు పేలచ్చడంపై ఆంక్షలు విధించింది. దీపావళి వేడుకల్లో హరిత బాణాసంచా మాత్రమే అనుమతించినట్లు స్పష్టం చేశారు. బేరియం నైట్రేట్ కలిగిన రసాయన పటాకుల వాడకం నిషేధించినట్లు సుప్రీంకోర్టు ఆదేశాల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వులు దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం విశేషం. దీంతో రాష్ట్రంలో పేలుడు బాణాసంచా వినియోగంపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక ఆంక్షలు జారీ చేసింది. ఈ మండలి జారీ చేసిన ఆంక్షల ప్రకారం రాష్ట్రంలో ప్రజలు దీపావళి నాడు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు బాణాసంచా కాల్చేందుకు అనుమతించారు. ఈ వ్యవధిలో అనుమతించిన హరిత బాణాసంచా మాత్రమే వినియోగించాలని ఆంక్షలు పేర్కొన్నాయి.

☛ శబ్ద కాలుష్య నివారణకు...

125 డెసిబెల్స్ కంటే అధిక శబ్దం వచ్చే బాణాసంచా పేల్చడం బోర్డు నిషేధించిందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి కె.మురుగేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల అధికారులకు లేఖలు జారీ చేసినట్లు తెలిపారు. దీపావళి రోజున ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రజలు బాణాసంచా కాల్చేందుకు సమయం కేటాయించారు. విద్యా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు మరియు మతపరమైన సంస్థల నుంచి 100 మీటర్ల పరిధిలో బాణాసంచా పేల్చడం నివారించారు. జిల్లా యంత్రాంగం మార్గదర్శకాలకు కట్టుబడి అనుకూల చర్యలు చేపట్టాలని తెలిపారు.

☛ ప్రత్యేక స్క్వాడ్‌లు ఏర్పాటు

కాలుష్య నివారణ కార్యాచరణ పటిష్టంగా నిర్వహించేందుకు జిల్లాస్థాయి అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో తనిఖీలు చేయడానికి ప్రత్యేక స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తారు. పటాకుల నుంచి వెలువడే ధ్వని తీవ్రత గుర్తించేందుకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు స్క్వాడ్ బృందాల్లో పాలుపంచుకుంటారు. ఆంక్షల ఉల్లంఘనకు పాల్పడే వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటారని వెల్లడించారు.

☛ రైళ్లలో అగ్ని ప్రమాదాల నివారణకు..

దీపావళి పండగ సమీపిస్తున్న తరుణంలో రైళ్లలో అవాంఛిత సంఘటనల నివారణకు రైల్వే శాఖ నడుం బిగించింది. ప్రయాణికుల భద్రత కోసం రైళ్లలో బాణాసంచా, గ్యాస్ సిలిండర్లు, యాసిడ్, పెట్రోలు, కిరోసిన్ మొదలైన మండే పదార్థాలను తీసుకెళ్లడం నివారించేందుకు ప్రయాణికులను చైతన్య పరుస్తున్నారు. ఈ మేరకు ప్రత్యేక అవగాహన బృందాలను రంగంలోకి దింపారు. ఈ బృందాలు రైల్వేస్టేషన్, ప్లాట్‌ఫారం, విశ్రాంతి గదులు,

ప్రయాణికులు సహకరించాలి

రైళ్లలో బాణాసంచా సంబంధిత ప్రమాదాలు, దుర్ఘటనల నివారణకు ప్రయాణికులు సహకరించాలని ఖుర్దా రోడ్ మండలం పిలుపునిచ్చింది. ఈ క్రమంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది, ప్రయాణికులు జాగ్రత్తగా ఉంటూ రైళ్లలో బాణాసంచా తీసుకుని వెళ్లకుండా, తోటి ప్రయాణికులను ఆ దిశలో అవగాహన పెంపొందించడంలో రైల్వే శాఖకు స్వచ్ఛందంగా సహకరించాలని అభ్యర్థించారు. రైళ్లలో బాణాసంచా రవాణా తారసపడితే తక్షణమే హెల్ప్ లైన్ నంబర్ 139కి ఫోను చేయాలని కోరారు. దీపావళి పురస్కరించుకుని రైళ్లలో బాణాసంచా రవాణాపై గట్టి నిఘా వేయాలని ఖుర్దా రోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ హెచ్.ఎస్.బజ్వా అధికారులకు ఆదేశించారు. రైళ్లు మరియు స్టేషన్లలో బాణాసంచా చాయలు లేకుండా చేయాలని తెలిపారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత కల్పించడంలో అంకితభావంతో పని చేయాలని స్పష్టం చేశారు.



రైల్వే ప్లాట్‌ఫాంపై ప్రయాణికుల లగేజీ తనిఖీ చేస్తున్న అధికారులు

రైళ్లలో ప్రయాణికుల లగేజీపై పటిష్ట నిఘా వేస్తాయి. తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం ప్రత్యేక భద్రతా డ్రైవ్‌లను ప్రారంభించింది. ఈ తనిఖీ బృందాల్లో ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) మరియు సివిల్ డిఫెన్స్ (సీడీ) అధికారులు సమన్వయంగా దాడులు చేపడుతున్నారు. ఈ చర్యల్లో భాగంగా రైల్వే పరిసరాల్లో అవాంఛిత, ఆకస్మిక అగ్ని ప్రమాదాల సత్వర నివారణకు అగ్నిమాపక పరికరాలు, యంత్రాలు అందుబాటులో ఉంచాలని అధికారులు ఆదేశించారు. రైళ్లలో ప్రయాణికుల బోగీలలో జనరేటర్, ప్యాంట్రీ (వంట) కోచ్‌లలో అమర్చిన స్మోక్ అండ్ ఫైర్ డిటెక్షన్ అలారం సిస్టమ్ పనితీరును తనిఖీ చేస్తున్నారు. ఈ కార్యాచరణపై అగ్నిమాపక యంత్రాల నిర్వహణ సిబ్బందికి ప్రత్యేక అవగాహన కల్పించారు.

బీజేపీలోకి చేరికలు

కొరాపుట్: జిల్లా రాజకీయాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. బీజేడీ నుంచి పలువురు నాయకులు ఆ పార్టీని వీడి బీజేపీలో బుధవారం చేరారు. గతంలో కొరాపుట్ విధానసభ స్థానం నుంచి బీజేడీ పార్టీ తరుపున పోటీ చేసిన రఘురాం మచ్చో చేరిక జరిగింది. గత కొద్ది రోజులుగా ఆయన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున బీజేడీ నుంచి సస్పెండ్‌కి గురయ్యారు. దీంతో అకస్మాత్తుగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఇదేవిధంగా జయపురం నుంచి బీజేడీ టికెట్టు ఆశిస్తున్న హిమాంశు మహాపాత్రో, ప్రముఖ పారిశ్రామికవేత్త జామి రమేష్‌లు సైతం బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న మన్‌మోహన్ సామల్ తదితరులు

డిప్యూటీ స్పీకర్ పదవికి రజనీకాంత్ రాజీనామా



స్పీకర్‌కు రాజీనామా అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ రజనీకాంత్ సింగ్

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ పదవికి రజనీకాంత్ సింగ్ రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఆయన స్పీకర్ ప్రమీలా మల్లిక్‌కు శాసనసభ సముదాయంలో తన కార్యాలయానికి వెళ్లి బుధవారం రాజీనామా పత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. డిప్యూటీ స్పీకర్ పదవి కారణంగా రాజకీయంగా పని చేయలేకపోతున్నట్లు తెలిపారు. తన నియోజకవర్గంలో ప్రజల కోసం పని చేసేందుకు పదవిని వదులుకున్నట్లు వెల్లడించారు. ఇక నుంచి పార్టీ కోసం, సంస్థ కోసం పని చేస్తానని పేర్కొన్నారు. తన నియోజకవర్గంలో బీజేడీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని తెలియజేశారు. రజనీకాంత్ సింగ్ 2004 సంవత్సరం నుంచి రాష్ట్ర శాసనసభ సభ్యుడుగా కొనసాగుతున్నారు. 2019 సంవత్సరంలో డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికై ఇప్పటివరకు నిరవధికంగా కొనసాగారు. ఆయన సభలో అంగుల్ శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డిప్యూటీ స్పీకర్ కావడానికి ముందు 2012 నుంచి 2014 సంవత్సరం వరకు నవీన్ పట్నాయక్ మంత్రి మండలిలో గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

గంజాయి స్వాధీనం



గంజాయి బస్తాలతో పట్టుబడిన నిందితులు

భువనేశ్వర్: ఖుర్దా రోడ్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారమ్‌పై పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రైలులో బీహార్‌కు తరలించేందుకు తచ్చాడుతున్న వ్యక్తుల నుంచి దీనిని స్వాధీనపరచుకున్నారు. ఈ వ్యవహారంలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి బుధవారం కోర్టుకు తరలించారు. ఖుర్దారోడ్ ప్రభుత్వ రైల్వే పోలీసులు మరియు రైల్వే రక్షక దళం (సీఐబీ) రైల్వే స్టేషన్‌లో సంయుక్తంగా నిర్వహించిన దాడిలో 2 బస్తాల్లో అక్రమంగా రవాణాకు సిద్ధం చేసిన గంజాయి గుర్తించారు. బీహార్ రాష్ట్రం ముంగేర్ జిల్లాకు చెందిన నిందితులు విశాల్ కుమార్ మరియు వికాష్ కుమార్ 2 బస్తాల్లో నింపిన 50 కిలోల గంజాయిని అక్రమ రవాణాకు సిద్ధం చేసినట్లు ధ్రువీకరించి అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఖుర్దా రోడ్ జీఆర్పీ ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం నిందితులకు వ్యతిరేకంగా కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ కోసం వీరిని బుధవారం కోర్టుకు తరలించారు. నిందితులు కంధమల్ ప్రాంతం నుంచి గంజాయిని సేకరించి న్యూఢిల్లీ వెళ్లే పురుషోత్తం ఎక్స్‌ప్రెస్ రైలులో రవాణా చేయడానికి ఖుర్దా రైల్వేస్టేషన్ 5వ నంబర్ ప్లాట్‌ఫారమ్‌పై వేచి ఉండగా పోలీసు వర్గాలకు చిక్కారు. స్వాధీనపరచుకున్న గంజాయి విలువ రూ.5 లక్షలు ఉంటుందని అంచనా.

పులి చర్మాలు స్వాధీనం



రాజ మాఝి



విక్రం మాఝి

• ఇద్దరి అరెస్టు

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్ పరిధి తొంపారాబిందుని కూడలిలో పులి చర్మాలను అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు అరెస్టు చేసినవారిలో చంద్రపూర్ ప్రాంతానికి చెందిన విక్రం మాఝి (31), రాజామాఝి (29) లు ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. కటక్, భువనేశ్వర్‌కు చెందిన స్పెషల్ టాస్క్‌ఫోర్సుకు అందిన సమాచారం మేరకు తొంపారాబిందుని కూడలిలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పులి చర్మాలను విక్రయించేందుకు సన్నద్ధమైన విక్రం, రాజాలను పట్టుకున్నారు. వీరి నుంచి రెండు పులి చర్మాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానిక ఎస్‌డీజేఎం కోర్టుకు తరలించారు. స్వాధీనం చేసుకున్న పులి చర్మాలను పరీక్షల నిమిత్తం డెహ్రాడూన్ పంపనున్నట్లు అధికారులు తెలియజేశారు.



స్వాధీనం చేసుకున్న పులి చర్మాలు

సెలవుల జాబితా విడుదల

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి సంబంధించిన అధికారిక సెలవుల జాబితాను విడుదల చేసింది. రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ 2024 క్యాలెండర్ సంవత్సరం సెలవు జాబితాను విడుదల చేసింది. జాబితాలో వివిధ పూజలు, పండగలు మరియు జాతీయ రోజులతో సహా మొత్తం 30 ప్రభుత్వ సెలవులు ఉన్నాయి. వీటితో పటు మరో 6 ఐచ్ఛిక సెలవులు ఉన్నాయి. జనవరి 15 మకర సంక్రాంతి నుంచి ప్రారంభమై డిసెంబర్ 25 క్రిస్మస్ వరకు 30 ప్రభుత్వ సెలవులు ఉన్నట్లు ఈ జాబితా స్పష్టం చేసింది. ఈ సెలవు రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రెవెన్యూ, మేజిస్ట్రేట్ కోర్టులు మూసివేయబడతాయి. అలాగే జనవరి 17న గురుగోవింద్ సింగ్ పుట్టినరోజు, జనవరి 25న బ్రహ్మసమాజ్ వ్యవస్థాపక దినోత్సవం, మార్చి 30న ఈస్టర్ శనివారం, మే 22న రాజా రామ్మోహన్ రాయ్ పుట్టినరోజు, జూలై 15న బహదూర్ యాత్ర మరియు డిసెంబర్ 24న క్రిస్మస్ ఈవ్ ఐచ్ఛిక సెలవులుగా ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ సౌలభ్యం మేరకు ఈ 6 ఐచ్ఛిక సెలవుల్లో ఏదైనా పండుగ, స్మారక రోజుల్లో ఒక ఐచ్ఛిక సెలవును పొందవచ్చు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 46 ఆదివారాలు మరియు 22 2వ మరియు 4వ శనివారాలు లభిస్తాయి. అంటే ప్రభుత్వ ఉద్యోగులకు ఒక ఐచ్ఛిక సెలవు మరియు 68 సెలవులు ఆది మరియు శనివారాల్లో (రెండవ మరియు నాల్గవది), 30 ప్రభుత్వ సెలవులు లభిస్తాయి. ఈ లెక్కన రానున్న 2024 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందికి సమగ్రంగా 99 సెలవులు లభిస్తాయి.

యువకుడి మృతదేహం లభ్యం



సునీల్ మృతదేహం



సునీల్ (ఫైల్)



మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియ సమితి కుమార్‌వీధికి చెందిన సునీల్ పోడియామి(21) మృతదేహం ఎట్టకేలకు బుధవారం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. అక్టోబర్ 29వ తేదీన సునీల్ తన స్నేహితులతో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లాడు. అయితే మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్నేహితులను సునీల్ ఎక్కడని అడిగారు. శబరీ నదిలో స్నానం చేసి వస్తానని చెప్పాడని వారు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో నది వద్దకు వెళ్లగా గట్టుపై సునీల్ దుస్తులు, సెల్‌ఫోన్ ఉన్నాయి. దీంతో నదిలో గల్లంతయ్యాడని కుటుంబ సభ్యులు పోడియ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక సిబ్బంది నదిలో రెండు రోజుల పాటు గాలించినా ఎటువంటి ఆచూకీ లభ్యమవ్వలేదు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. కాగా బుధవారం ఉదయం నదిలోని రాళ్ల మధ్యలో సునీల్ మృతదేహం తేలుతూ కనిపించింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, పోడియ ఐఐసీ నిరంజన్ హైకారాయి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది నదిలో దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే తమ బిడ్డను ఎవరో హత్య చేశారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోడియ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వస్తే హత్య జరిగిందా, ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడా అనేది తెలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు.

అధ్యక్షుడిగా ఎమ్మెల్యే కోడూరు



పర్లాకిమిడి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ రాష్ట్రంలో 36 సంఘటనల పార్టీ అధ్యక్షుల పదవులను బుధవారం ప్రకటించారు. అందులో గజపతి జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావును నియమించారు. గంజాంకు డాక్టర్ సుభాష్ సాహు, రాయఘడ జిల్లాకు శివ పట్నాయిక్‌లను నియమించారు.

నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలి



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

• గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీన

బరంపురం: సమాజానికి, ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తూ కేసులను పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీన సూచించారు. జిల్లాకేంద్రం ఛత్రపూర్‌లోని ఎస్పీ కార్యాలయంలో క్రైమ్ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో జరిగిన నేరాల జాబితాలో ఉండి తప్పించుకు తిరుగుతున్న నేరస్తులపై అరెస్టు వారెంట్ జారీ చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో తలదాచుకుంటున్న నేరస్తుల సమాచారం పక్కాగా సేకరించి అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా పోలీసుస్టేషన్లలో నమోదవుతున్న కేసులపై సరైన దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ స్టేషన్‌లో మహిళా డెస్క్‌లు ఏర్పాటు చేసి వారి కేసులపై తొలుత కౌన్సిలింగ్ నిర్వహించి, అనంతరం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇకపై ఆన్‌లైన్ పద్ధతిలో ట్రాఫిక్ అతిక్రమ జరిమానాలు విధించాలని సూచించారు. సమావేశంలో ఐఐసీ అధికారులు, ఎస్డీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు లారీలు ఢీ

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రహదారిలో వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా బుధవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వచ్చిన రెండు లారీలు అదుపుతప్పి ఢీ కొన్నాయి. రెండు లారీలు ఢీ కొట్టుకోవడంతో పెద్ద శబ్దం రాగా సమీపంలో ఉన్న వారంతా ఏం జరిగిందోనని భయాందోళన చెందారు. అయితే రెండు లారీల ముందర భాగాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ఢీ కొన్న లారీలను రోడ్డు పక్కకు జరిపి ట్రాఫిక్ క్లియర్ చేసి,కేసు నమోదు చేశారు.

15 గ్యాస్ సిలిండర్ల సీజ్

రాజాం సిటీ: పట్టణంలోని పలు హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న 15 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని సీఎస్‌డీటీ చిరంజీవరావు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో రాజాం, వంగర, చీపురుపల్లి, గరివిడి, భోగాపురం మండలాలకు చెందిన సివిల్ సప్‌లైస్ అధికారులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నట్లు గుర్తించి 15 సిలిండర్లను సీజ్‌చేసి స్వాధీనం చేసుకున్నారు. వాటిని స్థానిక లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించామని సీఎస్‌డీటీ తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గృహావసరాలకు సంబంధించిన గ్యాస్‌ను వాణిజ్య సముదాయాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. పట్టణంలో తరచూ దాడులు నిర్వహించనున్నామని, ఈ దాడుల్లో పట్టుబడిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్‌లైస్ అధికారులు చిరంజీవరావు, బి.మురళీకృష్ణ, రామకృష్ణ, శోభారాణి, సాయికామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారాతో పట్టుబడిన మహిళలకు రిమాండ్

కొత్తవలస: మండలంలోని గొల్లపేట గ్రామానికి చెందిన బొబ్బాది వరలక్ష్మి, లక్కవరపుకోట మండలం మార్లాపల్లి గ్రామంలో వడిసిల సింహాచలంను సారా అమ్ముతున్న కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఈబీ ఎస్సై పి.నరేంద్రకుమార్ తెలిపారు. ఆ ఇద్దరు మహిళలు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు ఆ మహిళల ఇళ్లవద్ద తనిఖీ చేసి వరలక్ష్మి ఇంటి వద్ద లీటర్ సారాను, సింహాచలం ఇంటి వద్ద లీటర్ల సారాను గుర్తించామన్నారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేంద్రకుమార్ వివరించారు.

ఈ-క్రాప్, ఈకేవైసీ రైతులే అర్హులు

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో వరిపంట 2.31 లక్షల ఎకరాల్లో సాగవగా, 1,73, 613 మంది రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్నారని జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామారావు తెలిపారు. వారంతా ఈకేవైసీ కూడా పూర్తి చేసుకున్నారని, వారి పంట మాత్రమే కొనుగోలుకు అర్హత కలిగి ఉందని చెప్పారు. రైతులు పంట కోతకు ముందు రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు షెడ్యూల్ చేయించుకోవాలని, ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండేవిధంగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఉన్న వాహనాల్లో మాత్రమే రవాణా చేయాలన్నారు. గోనె సంచులు, హమాలీలు రైతు ఏర్పాటు చేసుకుంటే వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎఫ్‌టీఓ చేతికందిన తర్వాత రైతు మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ చేయడానికి ఎవరైనా డబ్బులు అడిగితే ట్రోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫోన్‌చేసి వివరాలు తెలపాలని చెప్పారు. ధాన్యం అమ్మే విషయంలో ఎటువంటి ఇబ్బంది ఎదురైనా కంట్రోల్ రూమ్ నంబర్ 8331056278 తెలియజేయాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో ఆక్టోబర్ నెలలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల మూలంగా 5,601 ఎకరాల విస్తీర్ణంలో వరిపంట, 71 ఎకరాల్లో పత్తి, 90 ఎకరాల విస్తీర్ణంలో చోడిపంట పూర్తిస్థాయిలో ఎండిపోయిందన్నారు. అలాగే మరో 24,332 ఎకరాల్లో వరి పంటకు నీటి ఎద్దడి తీవ్ర స్థాయిలో ఉందని చెప్పారు. పంటల పరిశీలన నిమిత్తం కేంద్ర బృందం త్వరలో రానున్నదన్నారు. దెబ్బతిన్న పంటలకు నిబంధనలను అనుసరించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా వర్తిస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు.

ప్రభుత్వ మద్యం దుకాణాలపై పటిష్ట నిఘా

విజయనగరం క్రైమ్: జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాలపైనా పటిష్ట నిఘా ఏర్పాటుచేసి ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలని విజిలెన్స్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో బుధవారం ఆయన మాట్లాడుతూ సారా, నాన్ డ్యూటీపైడ్ లిక్కర్, ఇతర మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు ఎస్ఈబీ, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో దాడులు నిర్వహించాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ, జిల్లా మద్య నిషేధ, అబ్కారీ అధికారి ఆర్‌ఓ స్టాంప్‌ను ఎప్పటికప్పుడు మార్పు చేస్తూ అవకతవకలు చేసిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. శ్రీనాథుడు, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్.వెంకటరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో జాబ్‌మేళా


జాబ్‌మేళాపై సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: ఈనెల 23, 24 తేదీల్లో గజపతి జిల్లా స్థాయి జాబ్‌మేళా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉన్నతాధికారులతో జిల్లా పాలనాధికారి స్మృతి రంజన్ ప్రధాన్ బుధవారం మాట్లాడారు. 23న పర్లాకిమిడి స్టేడియంలో కాశీనగర్, గుమ్మా, గుసాని, రాయఘడ నిరుద్యోగ యువకులు జాబ్ మేళాకు హాజరవ్వనుండగా, 24న నువాగడ సమితిలోని అనుగురు స్టేడియంలో ఆర్.ఉదయగిరి, నువాగడ, మోహనా ప్రాంతం నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్‌మేళా నిర్వహించనున్నారు. రెండు కేంద్రాల్లో సుమారు 15 వేల మందికి వివిధ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ తెలిపారు. వివిధ కంపెనీల్లో ఉపాధి, శిక్షణ కోసం 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల ఏడో తరగతి నుంచి డిగ్రీ చదువుకున్న యువతీ యువకుల నుంచి దరఖాస్తులు కోరనున్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్, డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధి నాయక్, ఐటీడీఏ అధికారి ఫాల్గుణి మఝి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సౌభాగ్య స్మృతి రంజన త్రిపాఠి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సునరాం సింగ్, డిప్యూటీ డైరెక్టర్ (ఉద్యానవనాలు) సుశాంత రంజన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

గోపి గౌడోకు మాటి గౌరబ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న గోపినాథ్ గౌడో

రాయగడ: స్థానిక ఒడియా పాత్రికేయుడు గోపినాథ్ గౌడోకు మాటి గౌరబ్-2023 అవార్డు లభించింది. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని జయదేవ్ భవన్‌లో ఈ మేరకు జరిగిన ఒక కార్యక్రమంలో అవార్డును బుధవారం అందుకున్నారు. పాత్రికేయ రంగంలో ఎన్నో సేవలు అందించినందుకు ప్రతీ ఏడాది సోమరాయ్ ఫౌండేషన్ అనే సంస్థ ఈ అవార్డులను ప్రదానం చేస్తుంది. ఈ క్రమంలో రాయగడకు చెందిన గోపినాథ్ గౌడో తమ ప్రాంతంలోని సమస్యలను అధికారులకు తెలియజేసినందుకు గుర్తించిన సంస్థ ఈ అవార్డును ఇస్తున్నట్లు ప్రకటించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే సురేంద్ర రౌత్రాయ్, డాక్టర్ సూర్యప్రకాష్ చౌదరి, ప్రద్యుమ్న శతపతి, మీరా పొరిడా, ఓటీవీ యాంకర్ భవానీ శంకర్ మహాపాత్రో, వందిత త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు రగ్గుల పంపిణీ


పేదలకు రగ్గులు అందజేస్తున్న రచయిత్రులు

జయపురం: సమితిలోని కుందారిగుడ గ్రామంలో నిరుపేదలకు మహిళా రచయితల సంఘం సంసద్ సభ్యులు రగ్గులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డా.ప్రమీళ మాట్లాడుతూ.. చలికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మలేరియా, డెంగీ జ్వరాల వ్యాప్తి ఉంటుందని సూచించారు. అందుచేత ప్రజలు రాత్రులు పడుకునేటప్పుడు దోమ తెరలు వినియోగించాలన్నారు. తాము ఇచ్చిన రగ్గులతో చలినుండి కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంసద్ అధ్యక్షురాలు అధ్యక్షురాలు డా.ప్రమోదినీ, కార్యదర్శి కనకలతా రథ్, ఆర్గనైజర్ ఉర్మిళ శర్మ, పుష్పాంజలి దేవి, స్వాతీహోత్త, చిన్మయ సాహు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ లిఫ్టర్ల ప్రతిభ


పోటీల్లో బరువును ఎత్తుతున్న కోరాడ రమణ

నెల్లిమర్ల రూరల్: ముంబైలో ఈ నెల 6వ తేదీ నుంచి జరుగుతున్న అఖిల భారత రైల్వే వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో కొండవెలగాడ గ్రామానికి చెందిన లిఫ్టర్లు ప్రతిభ కనబరిచారు. 55 కేజీల పురుషుల విభాగంలో బుధవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న వల్లూరు చిన్నంనాయుడు 185 కేజీల బరువును ఎత్తి మూడో స్థానం, 55 కేజీల మహిళల విభాగంలో మత్స సంతోషి 146 కేజీల బరువును ఎత్తి మూడో స్థానం, 67 కేజీల పురుషుల విభాగంలో కోరాడ రమణ 252 కేజీల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన లిఫ్టర్లకు జెడ్పీటీసీ గదల సన్యాశినాయుడు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

లంచం కేసులో ఏసీబీ కోర్టు తీర్పు

విజయనగరం క్రైమ్: లంచం తీసుకున్న కేసుకు సంబంధించి ఏసీబీ కోర్టు బుధవారం తీర్పు వెల్లడించిందని ఏసీబీ డీఎస్పీ పి.రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకటన వివరాలిలా ఉన్నాయి. పలాసకు చెందిన ప్రేమ్‌కుమార్‌కు ఆయన తల్లిపేరున రైస్ మిల్లు ఉండేది. ఆ మిల్లుకు 25 హెచ్‌పీ పవర్‌లైన్ వేసే విషయంలో 2013లో అప్పటి ఏడీఈ ఎస్.మధుసూదనరావు రూ.20వేలు డిమాండ్‌చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా అధికారులు ట్రాప్ చేసి ఏడీఈని అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు. ఈ కేసులో విచారణ అనంతరం ముద్దాయికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష, ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష, రూ. 20వేలు జరిమానా విధిస్తూ విశాఖలోని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఆర్‌పీపీఎస్ మురళీకృష్ణ తీర్పు తీర్పు వెల్లడించారని డీఎస్పీ తెలిపారు. మధుసూధనరావు ప్రస్తుతం ఏలూరులో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు


సమావేశంలో పాల్గొన్న బీజేడీ నాయకులు

పర్లాకిమిడి: స్థానిక బిజూ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న అధికార బీజేడీ పార్టీ ప్రజా ప్రతినిధుల మాస్టర్ శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. శిక్షణ శిబిరానికి ఎంపీ సస్మితా పాత్రో, పర్లాకిమిడి నియోజకవర్గం బీజేడీ పరిశీలకుడు శశి భూషన్ మహంతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అభినాస్ ఠాకూర్, సువేందు మంగరాజ్ తదితరులు హాజరయ్యారు. శిక్షణా శిబిరంలో సీనియర్ నాయకుడు డా.తిరుపతి పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, గుసాని సమితి చైర్మన్ ఎన్.వీర్రాజు, ఎస్డీసీ చైర్మన్ మరియం రైయితో, రాష్ట్ర బీజేడీ కార్యవర్గ అధ్యక్షుడు మారుత్ పాలో, రూపేష్ పాణిగ్రాహి, భరత్ భూషన్ మహంతి, యువజన నాయకుడు శాసనం లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘నాయకులంతా సమష్టిగా పనిచేయాలి’


మాట్లాడుతూన్న సుభాష్ సాహు పక్కనే బిభుతి జెనా, కన్నుపతి తదితరులు

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం నాయకులంతా సమష్టిగా పనిచేయాలని గంజాం జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా.సుభాష్ సాహూ పిలుపునిచ్చారు. స్థానిక గిరిజ జంక్షన్ ప్రాంగణంలో ఒక ప్రైవేటు హోటల్‌లో బీజేపీ జిల్లాస్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో నాయకులంతా విజయంపై దృష్టి సారించాలన్నారు. దీనికోసం పార్టీ నాయకులంతా ప్రతీ బ్లాక్‌లోని పంచాయతీల్లో పార్టీలో చేరికలను ప్రోత్సహించి సమావేశాలు నిర్వహించాలని కోరారు. దేశవ్యాప్తంగా బీజేపీ పవనాలు వీస్తున్నాయని, రాష్ట్రంలోనూ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ నగర అధ్యక్షుడు కన్ను చరణ్‌పతి, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు బిభుతి జెనా తదితరులు పాల్గొన్నారు.

● రైతుల సమస్యలపై వినతి


కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన రైతులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల, పోడియా, కోరుకొండ, ఖోయిర్‌పూట్, మల్కన్‌గిరి, చిత్రకొండ, మత్తిలి సమితుల్లోని రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయానికి బుధవారం వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది 90 శాతం పంటలు పూర్తిగా నాశనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా జట్లు

- రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన బాలికలు
- తృతీయ స్థానం సాధించిన బాలుర జట్టు


రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ, తృతీయస్థానాలు సాధించిన బాలికలు, బాలుర జట్లు

తెర్లాం: రాష్ట్రస్థాయి 67వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలికలు, బాలుర జట్లు సత్తా చాటాయి. ఈ నెల 4 నుంచి 6వరకు మూడు రోజులపాటు ప్రకాశం జిల్లా ఒంగోలులో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన బాలికల జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించగా, బాలుర జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ఆటతీరును కనబరిచి జిల్లా జట్లు పతకాలు సాధించడం పట్ల సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల పీడీలు, పీఈటీలు క్రీడాకారులను అభినందించారు.

మద్యం షాపులో చోరీ

- రూ.2లక్షల,14వేలు మాయం


షాపు వెనుక వైపు చేసిన రంధ్రం

కొత్తవలస: మండలంలోని ఎస్.కోట రోడ్డులో ఉన్న నిహారిక హాస్పిటల్ సమీపంలో గల ప్రభుత్వ మద్యం షాపులో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి షాపులో చొరబడి రూ 2.14లక్షల నగదు దోచుకున్న విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. షాపు వెనుకన మనిషి దూరేంత రంధ్రం చేసి దుండగుడు లోనికి ప్రవేశించి కౌంటర్‌లో గల రూ. 2.14లక్షలు నగదు, రెండు క్వార్టర్ బాటిల్స్‌ను తీసుకెళ్లిపోయినట్లు షాపులో పనిచేసే సూపర్‌వైజర్ కర్రి మహేశ్వరరావు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

రాయగడలో మెగా వైద్య శిబిరం


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాయగడ: స్థానిక లయన్స్ క్లబ్‌లో లయన్స్, ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్‌లు సంయుక్తంగా మెగా వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించాయి. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఊన్న భాస్కరరావు, ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇప్పిలి సన్యాసిరాజుల పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో విజయనగరానికి చెందిన తిరుమల ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ శారథి కుమార్ పాత్రో (కార్డియాలజిస్ట్), డాక్టర్ మురళీకృష్ణ(న్యూరాలాజిస్ట్), డాక్టర్ హేమచంద్ (జనరల్ సర్జన్)లు పాల్గొన్నారు. రాయగడ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు.

స్విమ్మింగ్, తైక్వాండో పోటీలకు జిల్లా జట్ల పయనం


స్విమ్మింగ్ పోటీలకు బయలుదేరుతున్న జిల్లా అండర్-19 జట్టు


తైక్వాండో పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 బాల, బాలికల స్విమ్మింగ్, తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు బుధవారం పయనమయ్యాయి. ఈనెల 9 నుంచి తిరుపతి వేదికగా జరగనున్న పోటీలకు రెండు క్రీడాంశాల్లో 20 మందికి పైగా క్రీడాకారులు జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో అర్హత సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల నుద్దేశించి అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్‌కృష్ణ మాట్లాడుతూ తిరుపతి వేదికగా అండర్-19 విభాగంలో స్విమ్మింగ్, తైక్వాండో పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారులు ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచి విజేతలుగా నిలవడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ అధ్యాపకులు, కోచ్ అండ్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

జమ్మానపై కేసు కొట్టివేత

- హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పార్వతీపురం: మండలంలోని డీకేపట్నం పంచాయతీలో గల బోడికొండలోని గ్రానైట్‌ను లీజుకు ఇచ్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నంపై వైఎస్సార్‌సీపీ నాయకుడు జమ్మాన ప్రసన్నకుమార్ గిరిజనుల తరపున పోరాటం చేశారు. ఈ పోరాటంలో జమ్మాన ప్రసన్న కుమార్‌ను ప్రథమ ముద్దాయిగా చేస్తూ మరో 29మందిపై అప్పటి టీడీపీ ప్రభుత్వం 2017లోక్రిమినల్ కేసు నమోదు చేసింది. అప్పటి నుంచి దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ కాలం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో కేసు కొనసాగింది. జమ్మాన ప్రసన్నకుమార్ తరఫున న్యాయవాది డి. శాంతిరాజు ఈ కేసును వాదించారు. ఈ కేసులో వాదోపవాదాలు పూర్తయిన తరువాత జమ్మాన ప్రసన్నకుమార్‌ను నిర్దోషిగా గుర్తించి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బుధవారం తీర్పు నిచ్చారు.

సంతోషంగా బాణసంచా కాల్చివేత

దాదాపు 15వేల గిరిజన కుటుంబాల హక్కుల కోసం వైఎస్సార్‌సీపీ పార్వతీపురం సమన్వయకర్తగా అప్పట్లో ఉన్న జమ్మాన ప్రసన్నకుమార్‌తో పాటు సీపీఎం నాయకులు రెడ్డి శ్రీరామ్మూర్తి తదితరులపై అప్పటి టీడీపీ ప్రభుత్వం అక్రమ కేసులను నమోదు చేసింది. కేసు విచారణ జరుగుతుండగానే సీపీఎం నాయకుడు రెడ్డి శ్రీరామ్మూర్తి, మరో ఇద్దరు స్వర్గస్తులయ్యారు. దాదాపు ఏడేళ్లపాటు కోర్టులో విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో జమ్మాన ప్రసన్నకుమార్‌తోపాటు మిగిలిన వారిపై ఉన్న కేసును కొట్టివేస్తూ నిర్దోషులుగా ప్రకటిస్తూ బుధవారం తీర్పు వెలువడడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పోరాటానికి నైతిక మద్దతు తెలిపిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం రాజన్నదొర, కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణితోపాటు పలువురు తనకు మద్దతు తెలిపారని చెప్పారు. ఈ సందర్భంగా గిరిజనులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

బొలెరో ఢీకొని యువకుడి మృతి


మరణించిన కేకేవై కిరణ్ (ఫైల్)

డెంకాడ: మండలంలోని మోదవలస వద్ద జాతీయ రహదారిపై బైక్‌ను బొలెరో ఢీకొట్టడంతో ఓ యువకుడు బుధవారం మృతిచెందాడు. ఈ ప్రమాదంపై ఎస్సై మహేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లాలోని పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన కేకేవై కిరణ్(20) విజయనగరం నుంచి బైక్‌పై విశాఖ వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టడంతో రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడిని స్థానికులు చికిత్స నిమిత్తం తగరపువలసలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

గుర్తు తెలియని వ్యక్తి...


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గజపతినగరం: మండలంలోని గుడివాడ గ్రామం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు బుధవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుడివాడ గ్రామ సమీపంలో రైల్వేట్రాక్ వద్ద ఆయన గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని గజపతినగరం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ ఘటనపై రైల్వే ఎస్సై రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రైతు అనుమానాస్పద మృతి



పొలంలో సింహాచలం మృతదేహం

పోలాకి: మండలంలోని సుసరాం గ్రామానికి చెందిన తమ్మినాన సింహాచలం(57) అనే రైతు వ్యవసాయ పొలంలో సాగునీరు పెట్టేందుకు వెళ్లి అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుడి కుమార్తె ససపల సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మృతికి గల కారణాలు తెలియలేదని,కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

ఎలుగుపిల్ల మృత్యువాత



జీడితోటలో మరణించిన ఎలుగుబంటి పిల్ల

మందస : ఉద్దానం ప్రాంతమైన బహడపల్లి సమీపంలోని జీడితోటల్లో ఓ ఎలుగుబంటి పిల్ల మంగళవారం రాత్రి మరణించింది. ఇటీవల ఉద్దానంలో ఎలుగుబంట్ల సంచారం ఎక్కువైంది. పిల్ల ఎలుగుబంట్లు కూడా ఎక్కువగా తిరుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం ఇక్కడికి వచ్చిన ఎలుగు పిల్లను సేదతీర్చి పాలుపట్టి తోటల్లో వదిలేశారు. తోటల్లో మరణించిన ఎలుగుపిల్లకు గాయాలు లేకపోవడంతో అనారోగ్యంతో మరణించి ఉంటుందని భావిస్తున్నారు. ఎలుగుబంటి పిల్ల మరణించడంతో తల్లి ఎలుగు ఆసహనంతో ఉంటుందని, ఎవరిపై.. ఎప్పుడు దాడి చేస్తోందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారాన్ని అటవీశాఖాధికారులకు తెలియజేశారు.

కొండచిలువ దాడిలో మేక పిల్లలు మృతి



హతమైన కొండచిలువ

టెక్కలి రూరల్: మండలంలోని సరియాపల్లి గ్రామంలో కొండచిలువ దాడిలో బుధవారం నాలుగు మేక పిల్లలు మృతిచెందాయి. బొరిగిపేటకు చెందిన గండేటి రామారావు తన మేక పిల్లలను సరియాపల్లి గ్రామ సమీపంలో మేతకు తీసుకువెళ్లాడు. ఈ సమయంలో అటుగా వచ్చిన కొండచిలువ దాడి చేయడంతో నాలుగు మేకపిల్లలు మృతి చెందాయి. స్థానికులు అప్రమత్తమై కొండచిలువను హతమార్చారు.

ఐటీఈపీ కోర్సులో ప్రవేశాలకు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం (2023-24) ప్రారంభిస్తున్న నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. బీఏబీఈడీ, బీఎస్సీ బీఈడీలో 110 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నేరుగా గానీ, రిజిస్టర్ పోస్టులో గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ టెస్ట్ -2023 అర్హత మార్కులు సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 16న మెరిట్ లిస్ట్ ప్రదర్శిస్తామని తెలిపారు.

చార్జిషీట్‌లు వేగవంతం చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జైల్లో ఉన్న ముద్దాయిల కేసుల విషయంలో త్వరితగతిన చార్జిషీట్ ఫైల్ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అధికారులను ఆదేశించారు. జిల్లా కోర్టులోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో అండర్ ట్రయల్ ప్రిజనర్స్ సమీక్ష బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా పోలీసు యంత్రాంగం కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు శ్రీదేవి, మహేంద్ర ఫణికుమార్, భాస్కరరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తిప్పేస్వామి, జిల్లా జైలు సూపరింటెండెంట్ నబీఖాన్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కథా ప్రపంచానికి స్వాగతం

- శ్రీకాకుళానికి ప్రత్యేక ఆకర్షణగా కథా నిలయం
- అందుబాటులో వేలాది కథలు
- ఆన్‌లైన్‌లోనూ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం
- నేడు కారామాస్టారు శతజయంతి ఆరంభ సభ

శ్రీకాకుళం కల్చరల్: అగ్రగణ్య తెలుగు కథా రచయితల్లో కాళీపట్నం రామారావు(కారా మాస్టారు)కు ప్రత్యేక స్థానం. కథల ప్రపంచానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే శ్రీకాకుళం కథా నిలయం వ్యవస్థాపకులుగా తనదైన ముద్ర వేశారు. అటువంటి మహనీయుడి శత జయంతి సభ ఈ నెల 9న జరగనుంది. జిల్లా కేంద్రంలోని కథా నిలయంలో జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి అధ్యక్షునిగా ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, ముఖ్య అతిథిగా ప్రముఖ నాటక రచయిత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు, స్నేహ కళాసాహితీ, విశ్వసాహితి, రాజాం రచయితల వేదిక, కథానిలయం ట్రస్టు సభ్యులు, సాహితీ స్రవంతి శ్రీకాకుళం ,విజయనగరం, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం రచయితలు, అభిమానులు హాజరుకానున్నారు.

కథలకు నెలవు..

కారామాస్టారుగా ప్రసిద్ధిగాంచిన కాళీపట్నం రామారావు 1924 నవంబరు 9న జన్మించారు. సామాన్యులకూ అర్థమయ్యే భాషలో రచనలు చేశారు. శ్రీకాకుళంలో ఎస్‌ఎస్‌ఎల్‌సీ వరకు చదివారు. భీమిలిలో సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ స్కూల్లో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. 1943 నుంచి 1946 వరకు పలుచోట్ల ఉద్యోగాలు చేసి 1948 నుంచి ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు. 1972లో ఉద్యోగ విరమణ చేశారు. 2021 జూన్ 4న తుదిశ్వాస విడిచారు. ఆయన మరణానంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్‌ఆర్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించింది. కారా మాస్టారు 1996లో రాసిన యజ్ఞం కథకు సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. దాంతో వచ్చిన సొమ్ముతో ఆత్మీయులు, రచయితల సలహాల మేరకు కథా నిలయాన్ని ఏర్పాటు చేశారు. 1997 ఫిబ్రవరిలో శ్రీకాకుళంలోని విశాఖ-ఏ కాలనీలో సూర్యానగర్ వద్ద రెండంతస్తుల భవనాన్ని కథా నిలయంగా మార్చారు.



కథానిలయంలో ఉన్న పుస్తకాలు

కారామాస్టరు

అన్ని కథలు నిక్షిప్తం..

1986 నుంచి కథల సేకరణ మొదలుపెట్టారు. 1910 కాలం నాటి కథలు సైతం సేకరించారు. ఆల్ ఇండియా రేడియో సహకారంతో ఇప్పటి వరకు 40మంది రచయితల గొంతుకలను రికార్డు చేశారు. 800 పుస్తకాలతో ప్రారంభమైన కథానిలయంలో ప్రస్తుతం 16 వేల పుస్తకాలు, 24 వేల పత్రికలు, 5 వేల సంకలనాలు, కథా సంపుటాలు, 100 ఫీచర్ రచనలు, 105 వ్యాస సంకలనాలు, 67 ఆత్మకథలు, 97 పరిశోధనా పత్రాలు, 95 జీవిత చరిత్రలు, 130 సాహిత్య సర్వస్వాలు, 53 ఉపయుక్త గ్రంథాల సూచికలు, 45ఇతర భాషల్లో వచ్చిన తెలుగు పుస్తకాలు, 8200 ఇతర పుస్తకాలు సేకరించారు. 15 వేల కథా రచయితలకు చెందిన పుస్తకాలు నిక్షిప్తం చేశారు. ఆన్‌లైన్‌లో 'కథానిలయం డాట్‌కామ్'లో కథలు డౌన్‌లోడ్ చేసి చదువుకోవచ్చు. కథలపై పరిశోధన చేసే వారికి కథా నిలయం ఆసరాగా ఉంటోంది. 2004లో కేంద్ర సాహిత్య అకాడమీ రూపొందించిన 'తెలుగు కథాకోశం' పుస్తకానికి కథానిలయం పూర్తి సహకారం అందించింది. ఇది రచయితల డైరెక్టరీ గానూ ఉపయోగపడుతోంది.



కథానిలయం

12 ఏళ్ల అనుబంధం..



కారా మాస్టారుతో కలిసి కథల సేకరణ కోసం పనిచేశాను. ఆయనతో 12 ఏళ్లు కలిసి పనిచేయడం నా సాహిత్య జీవితంలో మరిచిపోలేనిది. ఆయన ఆశయాలకు తగ్గట్టుగా కథా నిలయాన్ని నడుపుతున్నాం.

– దాసరి రామచంద్రరావు, రచయిత, కథా నిలయం ట్రస్టు కార్యదర్శి

ఆయన బాటలోనే..



శ్రీకాకుళ సాహితీ, కారా మాస్టారు, కథానిలయం ఈ మూడు వ్యవస్థలు కలిస్తే కాళీపట్నం రామారావు. మాస్టారుతో ప్రయాణం మూడు దశాబ్దాలు. తెలుగు సాహితీ రంగంలో ఆయన చూపిన బాట అందరికీ ఆదర్శం.

– అట్టాడ అప్పలనాయుడు, కథా, నవలా రచయిత

సీతారాముల కల్యాణం చూతము రారండి

- నేడు శ్రీకాకుళం ఎన్టీఆర్ పురపాలక మైదానంలో నిర్వహణ
- రెండు వేల మంది దంపతుల సమక్షంలో కల్యాణోత్సవం



మైదానంలో ఏర్పాటు చేస్తున్న ఆలయ నమూనా



టూటౌన్ ఎస్‌ఐతో చర్చిస్తున్న జస్టిస్ యతిరాజులు

శ్రీకాకుళం కల్చరల్: సీతారాముల కల్యాణోత్సవానికి శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలి వద్ద ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం సిద్ధమైంది. నారాయణ తిరుమల ఆధ్వర్యంలో రెండువేల మంది దంపతుల సమక్షంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రామతీర్థాల నుంచి తీసుకొవచ్చిన సీతారాముల ఉత్సవమూర్తులకు సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించనున్నారు. అయోధ్య రామాలయానికి చెందిన శ్రీరామ బంగారు పాదుకలు భక్తుల దర్శనార్థం ఉంచుతున్నారు.

భక్తులకు సౌకర్యాలు..

కల్యాణోత్సవ ఏర్పాట్లను నారాయణ తిరుమల అనువంశిక ధర్మకర్త జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు బుధవారం పరిశీలించారు. కల్యాణానికి విచ్చేసే భక్తులకు, పాదులను దర్శించడానికి వచ్చే భక్తులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. రెండు వేల మంది దంపతులు కూర్చునేలా 4వేల కుర్చీలు వేయిస్తున్నామని తెలిపారు. సాయంత్రం 3 గంటలకు నారాయణ తిరుమల నుంచి విజయోత్సవ యాత్ర బయలుదేరుతుందన్నారు. ఆధ్యాత్మిక వైభవం గోచరించేలా రూ.12 లక్షలతో ఆలయ సెట్ సిద్ధం చేసినట్లు తెలిపారు. కల్యాణాన్ని బయట నుంచి తిలకించేందుకు వీలుగా ప్రధాన కూడళ్ల వద్ద ఎల్‌ఇడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

పార్కింగ్ ఇలా..

టూవీలర్, కార్లకు మైదానం బయటకు పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని యతిరాజులు తెలిపారు. పార్కింగ్, బందోబస్తుపై రెండో పట్టణ ఎస్‌ఐ లక్ష్మణరావుతో చర్చించినట్లు చెప్పారు. చెప్పులు భద్రపరిచేందుకు మైదానం లోపల ప్రవేశద్వారం వద్ద కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ శాఖ సహకారంతో తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ సుగుణాకరరావు, ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పేర్ల సాంబమూర్తి, బత్తుల శారద, కృష్ణమోహన్, శ్రావణ్, మల్లారపు చక్రవర్తి పాల్గొన్నారు.

● గాల్లో ప్రాణాలు!



నరసన్నపేట జాతీయ రహదారిలో జమ్ము కూడలి వద్ద ఫ్లై ఓవర్ రోడ్డుపై బుధవారం గ్రానైట్ ట్రాలీ లారీ అదుపు తప్పింది. విశాఖ నుంచి టెక్కలి వెళ్తూ డివైడర్ మీదుగా దూసుకెళ్లి టెక్కలి-శ్రీకాకుళం రోడ్డు దాటి రక్షణ గోడను ఢీకొట్టింది. లారీ ముందుభాగం గాల్లో వేలాడుతూ కనిపించింది. డ్రైవర్ జోయి రాజు సకాలంలో బయటకు వచ్చేయడం, రోడ్డుపై ఇతర వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నరసన్నపేట ఎస్‌ఐ వై.సింహాచలం ఆధ్వర్యంలో లారీని జేసీబీలతో తొలగించారు. –నరసన్నపేట

అక్రమంగా ఆవులు తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

కోటబొమ్మాళి: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రెండు వ్యాన్‌లలో తరలిస్తున్న 110 ఆవులను గురువారం శ్రీకాకుళం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్లు పి.రాజు, షేక్ అహమ్మద్‌లను అరెస్టు చేసి కోటబొమ్మాళి పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి సేకరించిన ఆవులను రెండు వ్యానులల్లో ఎక్కించి ఎవరికీ కనిపించకుండా చుట్టూ పరదాలతో కప్పి హైదరాబాద్‌కు తరలిస్తున్నారన్న సమాచారమందుకున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కోటబొమ్మాళి మార్కెట్‌యార్డు వద్ద జాతీయ రహదారిపై కాపుకాశారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు వ్యాన్‌లలో ఆవులను గుర్తించారు. కేసు నమోదు చేసి ఆవులను కొత్తవలస గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.



వ్యాన్‌లో ఉన్న ఆవులు

నందిగాంలో పులి కలకలం

నందిగాం: ఇటీవల పలు మండలాల్లో సంచరిస్తూ హడలెత్తిస్తున్న పెద్దపులి నందిగాం మండల పరిధిలోకి ప్రవేశించినట్లు అటవీ అధికారులు ధ్రువీకరించారు. కొండల ప్రాంతమైన బడగాం పంచాయతీ సవర బడగాంకు చెందిన సవర నాగేశ్వరరావు అనే ఉపాధ్యాయుడు తన కుమారుడితో కలిసి బుధవారం ఉదయం తోటకు వెళ్లి వస్తుండగా ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వైపు నుంచి కొండతెంబూరు కొండ వైపు పులి వెళ్తున్నట్లు గుర్తించారు. వెంటనే గ్రామస్తులకు తెలియజేయడంతో వారంతా వచ్చి పరిశీలించగా పాదముద్రలు కనిపించాయి. విషయం తెలుసుకున్న పాతపట్నం రేంజ్ అటవీ అధికారి రౌతు రాజశేఖర్ సిబ్బందిని గ్రామానికి పంపించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని నందిగాం తహశీల్దార్ పద్మావతి సూచించారు.

ఉద్యోగ బాధ్యతలను మరిచిపోవద్దు

అరసవల్లి: కొత్తగా ఉద్యోగాలు పొందిన వారు, పదోన్నతులు పొందిన వారు ఉద్యోగ బాధ్యతలను మరచిపోవద్దని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మంగళవారం ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లకు టైపిస్టులుగా పదోన్నతులు కల్పించగా, మరో ఇద్దరికి కారుణ్య నియామకాల కింద టైపిస్టులుగా నియామక పత్రాలను ఆమె అందజేశారు. ఐదుగురు నైట్‌వాచ్‌మేన్లకు ఆఫీస్ సబార్డినేట్లుగా కన్వర్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అరబిందో ఇకపై ఏపీటోరియా ఫార్మా

రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామికవాడలో మూడున్నర దశాబ్దాలకు పైగా ఫార్మా రంగంలో జీవనాధార ఔషధాలు తయారు చేస్తున్న అరబిందో ఫార్మాను ఏపీటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌గా పేరు మార్చినట్లు కార్పొరేట్ హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ యు.ఎస్.బి.రాజు తెలిపారు. బుధవారం పైడిభీమవరంలోని పరిశ్రమలో ఫ్యాక్టరీ ప్రతినిధులు, కాంట్రాక్టర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ఆదేశాల మేరకు అక్టోబర్ 1 నుంచి యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియంట్ (ఏపీఐ) విభాగాలు కలిపి ఏపీటోరియా ఫార్మా ప్రైవేటు లిమిటెడ్‌గా మనుగడలోకి వచ్చిందన్నారు. యాజమాన్యం, బోర్డాఫ్ డైరెక్టర్స్, ఇతర పాలసీల్లో ఎటువంటి మార్పులు లేవని స్పష్టం చేశారు.

పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో విద్య

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ.. పోటీ ప్రపంచానికి అనుగుణంగా తయారుచేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మనబడి నాడు-నేడులో భాగంగా రూ.1.16 కోట్ల నిధులతో నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చదువుతోనే పేదరికాన్ని రూపు మాపవచ్చని, చదువే పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి అని భావించి సీఎం జగన్ విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థులకు అందించడంలో అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని కితాబిచ్చారు. సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో మనబడి నాడు-నేడు ద్వారా చేపడుతున్న పనుల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, డీఈవో కె.వెంకటేశ్వరరావు, ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, హెచ్‌ఎం ఆర్.విజయకుమారి, రవికుమార్, చింతాడ రవికుమార్, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థితో ముచ్చటిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

వెంటాడిన మృత్యువు

- నాగావళి నదిలో మునిగి బాలుడి మృత్యువాత
- తల్లడిల్లిన తల్లిదండ్రులు

శ్రీకాకుళం క్రైమ్ : పాఠశాలకు సెలవు ఇచ్చారనే ఆనందంతో నదీస్నానానికి వెళ్లిన ఓ విద్యార్థిని మృత్యువు వెంటాడింది. ఆ కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచేసింది. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న నాగావళి నదిలో బుధవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం డీసీసీబీ కాలనీ సమీపంలోని భవానీనగర్‌కు చెందిన గొర్లె మహేశ్వరరావు, సునీత దంపతులకు అగ్రికల్చరల్ బీఎస్సీ చదువుతున్న కుమార్తె, తొమ్మిదో తరగతి చదువుతున్న కుమారుడు శశాంక్ (14) ఉన్నారు. మహేశ్వరరావు ఎల్‌ఎన్‌పేట మండలం రావిచంద్ర ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. శశాంక్ నారాయణ స్కూల్‌లో చదువుతున్నాడు. ఎస్‌ఎఫ్‌ఐ బంద్ కారణంగా బుధవారం సెలవు దినం కావడంతో సమీపంలోనే బ్యాంకర్స్‌కాలనీకి చెందిన నలుగురు మిత్రులు నాగరాజు, పవన్ సాయి, లోచన్, యువరాజ్‌లతో కలిసి ఉదయం ఎనిమిదింటికే ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆర్ట్స్ కళాశాల వెనుకభాగాన ఉన్న నాగావళి నది వద్దకు చేరి కాసేపు క్రికెట్ ఆడారు. తర్వాత అందరూ ఒకేసారి నదిలో స్నానానికి దిగుతుండగా అక్కడే ఉన్న ఓ దివ్యాంగుడు వారించాడు. నదిలో దిగొద్దని చెప్పినా వినకుండా లోపలకు వెళ్లడంతో ఒక్కసారిగా గుమ్మి ప్రాంతంలోకి శశాంక్ జారిపోయాడు. మిగిలిన వారు బయటకు వచ్చి కేకలు వేయడంతో దివ్యాంగుడు రక్షించే ప్రయత్నం చేసినా అప్పటికే శశాంక్ మునిగిపోయాడు. వెంటనే డయల్ 100కు ఫోన్ చేయడంతో రెండో పట్టణ ఎస్‌ఐ నాగిరెడ్డి లక్ష్మణరావు, హెడ్ కానిస్టేబుల్ జి.సత్యనారాయణ, పీసీలు త్రినాథ్, విజయ్‌లు ఘటనా స్థలికి చేరుకుని అగ్నిమాపక శాఖకు సమాచారమందించారు. ఏఎస్‌ఎఫ్‌వో పి.దుర్గారెడ్డి, డ్రైవింగ్ ఆపరేటర్ బి.అప్పారావు, ఫైర్‌మాన్ ఎల్.రమణ, వై.పాపారావులతో కూడిన రెస్క్యూ బృందం శశాంక్ మృతదేహాన్ని బయటకు తీశారు. తల్లి సునీత విగతజీవిలా పడివున్న కుమారుడి మృతదేహాన్ని చూసి రోదించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. అనంతరం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి



గొర్లె శశాంక్ (ఫైల్)

రైతుకూలీ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

పలాస: మండలంలోని బొడ్డపాడు జిల్లా అమరవీరుల స్మారక భవనం వద్ద రెండు రోజుల పాటు జరిగిన అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా 10వ మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు ప్రకటించారు. జిల్లా అధ్యక్షునిగా మామిడి భీమారావు, ఉపాధ్యక్షునిగా సవర బంగ్లా కుమార్, జిల్లా కార్యదర్శిగా బైరి కూర్మారావు, సహాయ కార్యదర్శిగా జి.లక్ష్మణరావు, కోశాధికారిగా వంకల పాపయ్య, మురిపింటి తాతారావు, ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లాలోని వివిధ సమస్యలపై పూర్వపు జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. వంశధార కాలువను ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని, 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16వేలు చెల్లించాలని, 1/70 చట్టాన్ని అమలు చేయాలని, ఆదివాసీ ప్రాంతంలో భూములకు రక్షణ కల్పించాలని, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని తీర్మానాలు చేస్తూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

వేలి కొనలపై ఓటు వివరం

- ఓటర్ హెల్ప్ యాప్‌లో ఓటు హక్కు వివరాలు
- ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కు ఉందో, లేదో తెలుసుకునే వెసులుబాటు
- ఓటరు కార్డు నంబర్‌తో వివరాలు లభ్యం



ఆమదాలవలస రూరల్: సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితా తయారు చేసి వెల్లడించారు. జిల్లాలో 18,43,376 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తమ ఓట్లు ఉన్నాయో లేవో వివరాలు ఎలా తెలుసుకోవాలో అన్న మీమాంస చాలా మందిలో ఉంటుంది. వాటికి సమాధానంగా కేంద్ర ఎన్నికల సంఘం ఓ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. సెల్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు మీ ఓటు ఉందో, లేదో మీ ఇంటి డోర్ నంబర్‌లో ఎన్ని ఓట్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు. దొంగ ఓట్లు ఉంటే వాటిని కూడా తెలుసుకోవచ్చు.

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌తో

- ముందుగా ఆండ్రాయిడ్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో ఒకటి ఎంపిక చేసుకుని రిజిస్టర్ చేయాలి. తరువాత మీ ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు నాలుగు మార్గాలు ఉన్నాయి.
- బార్ కోడింగ్ స్కానింగ్ ద్వారా పాత ఓటరు కార్డుల ముందు భాగంలో బార్ కోడ్ ఉంటుంది. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని బార్ కోడ్ ఆప్షన్‌ని ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. కెమెరా తెరుచుకోగానే ఓటరు కార్డుపై ఉన్న బార్ కోడ్ స్కాన్ చేస్తే మీ ఓటు వివరాలు వస్తాయి.
- క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా కొత్త ఓటరు కార్డులు క్యూఆర్ కోడ్‌తో వస్తున్నాయి. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని క్యూఆర్ కోడ్ ఆప్షన్ ఎంపిక చేసుకుని స్కాన్ చేస్తే మీ ఓటరు వివరాలు తెలుస్తాయి.
- వివరాల నమోదు చూసి దీని ద్వారా ఓటరు వివరాలు తెలుసుకోవచ్చు. ఓటరు కార్డులో ఉన్నట్లు గానే పేరు, తండ్రి పేరు, వయస్సు, లింగం, రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం వివరాలు నమోదు చేస్తే మీ ఓటు గురించి తెలుసుకోవచ్చు.
- ఓటు కార్డు నంబర్‌తో ఓటరు వివరాలు తెలుసుకోవచ్చును. ప్రతి ఓటు కార్డుకు నంబర్ ఉంటుంది. నంబర్ ఆప్షన్ ఎంచుకుని మీ కార్డు నెంబరు నమోదు చేస్తే ఓటు వివరాలు తెలుస్తాయి.
- పై నాలుగు విధానాల్లో ఇది చాలా సులువుగా ఉంటుంది. మీ వద్ద కార్డు లేకపోతే నంబరు ఉంటే చాలు మీ ఓటు వివరాలు తెలుస్తాయి.

వెబ్‌సైట్ ద్వారా..



ఎన్నికల సంఘం ఓటర్స్ సర్వీస్ పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా ఓటు ఉందో లేదో తెలుసుకోవచ్చును. దీనికి voters.eci.gov.in లోకి వెళ్లాలి. ఓటర్స్ సర్వీస్ పోర్టల్ కేంద్ర ఎన్నికల సంఘంను క్లిక్ చేయాలి. ఇందులో సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్‌ను క్లిక్ చేయాలి. ఇక్కడ సెర్చ్ బై డిటైల్స్, సెర్చ్ బై ఎపిక్, సెర్చ్ బై మొబైల్ ఆప్షన్లలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాలి. దానిలో వివరాలు నమోదు చేసి, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి, సెర్చ్ చేస్తే మీ ఓటు ఉందో లేదో తెలిసిపోతుంది. సెర్చ్ బై డిటైల్స్ అనేది కాస్తంత కఠినంగా ఉంటుంది. మిగిలిన రెండు ఆప్షన్ల ద్వారా సులువుగా తెలుసుకోవచ్చు. సెర్చ్ బై మొబైల్ ఎంపిక చేసి ఆ మొబైల్ నంబర్‌తో ఎన్ని ఓట్లు లింక్ అయి ఉన్నా వాటి వివరాలన్నీ వస్తాయి. పై ఆప్షన్ల ద్వారా మీ వివరాలు కనిపించకపోతే మీ ఓటు పోయినట్లు. వెంటనే మీ బూత్ లెవెల్ అధికారికి ఫిర్యాదు చేయాలి. కొత్త ఓటు నమోదు చేస్తారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం బాధ్యత.